పింఛన్ల పంపిణీ పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 9వ వార్డు గాంధీ నగర్లో వార్డు సచివాలయ కార్యదర్శులు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీపై కమిషనర్ పి.నరసింహ ప్రసాద్తో మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ పక్కాగా పూర్తిచేయాలని లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందించాలన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

మౌలిక వసతుల కల్పన తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

హౌసింగ్ కాలనీలలో విద్యుత్, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పన కచ్చితంగా జరగాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో హౌసింగ్ పురోగతిపై డిఆర్డిఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు వారాల వ్యవధిలో 217 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, ఈ సంఖ్యను 300కు పెంచాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.137.19 కోట్లు ఖర్చు చేసి 6,175 గృహాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో గృహ నిర్మాణాలు బిలో బేస్మెంట్ లెవెల్ లో 73, బేస్మెంట్ లెవెల్ 1219, రూఫ్ లెవెల్ 467 లో ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ లేఔట్లలో సమస్యలు ఉన్నట్లయితే ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తహశీల్దార్లతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈనెల లోపు రెండు గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే బాధ్యత ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తీసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి వెలుగు సిబ్బంది, ఎపిఎంలతో కలిసి ఎంపిడిఓలు కనీసం రెండు మండలస్థాయి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. గృహనిర్మాణాల పురోగతిని ఎంపిడిఓలు క్షేత్రస్థాయికి వెళ్లి క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో గృహ నిర్మాణాల పూర్తికి హౌసింగ్ ఏఈలతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న అర్హులైన వ్యక్తిగత బెనిఫిషరీల సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాదాపుగా పూర్తయ్యే స్థితిలో ఉన్న ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పూర్తయిన గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. డిఆర్డిఏ ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించి స్వయం సహాయక సంఘాల ద్వారా అర్హులకు రుణాలు మంజూరు చేయాలని, రుణాల మంజూరులో అవినీతికి పాల్పడరాదని తెలిపారు. వరద సమీక్షలు నిర్వహించి బేస్మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్లో ఉన్న ఇంటి నిర్మాణాల లబ్ధిదారులను గుర్తించి వారికి అదన ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ కాలనీలలో విద్యుత్, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పన కచ్చితంగా జరగాలని తెలిపారు. గృహనిర్మాణాలకు అవసరమైన మెటీరియల్స్, సిమెంటు అందుబాటులో ఉంచుకోవాలని, నాణ్యతలో రాజీ పడవద్దు అని తెలిపారు.



గృహనిర్మాణాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని కోరుతూ 2వ తేదీ శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమయ్యారు. సుదీర్ఘకాలం బకాయిలను చెల్లించాలని, జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతులు అందజేసినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్నట్టు ఫ్యాప్టో నేతలు స్పష్టం చేశారు. అలాగే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, బోధనను హరించే యాప్లను పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఆందోళనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

బకాయిలు చెల్లించండి

నేడు కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని, అనేక రూపాలలో అనేక సార్లు ఉద్యమాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్రసంఘ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా కార్యక్రమానికి ఫ్యాప్టో నాయకత్వం పిలుపునిచ్చింది. నిర్బంధంగా పి-4 కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడం, అప్గ్రేడ్ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లింపు, 72, 73, 74 జీవోలు అమలు, హైస్కూల్ ప్లస్లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగింపు, పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు, 30శాతం మధ్యంతర భృతి, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇతర బకాయిల చెల్లింపు, పెండింగ్ డీఏలు 3, 11వ పిఆర్సీ బకాయిల చెల్లింపు, పాత పెన్షన్ విధానం అమలు, ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగింపు, పరీక్షలను తెలుగులో రాసే అవకాశం, అంతర్ జిల్లాల బదిలీలు, పి.ఈ.టి.లకు ఉద్యోగోన్నతులు, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నమవుతున్న సమస్యల పరిష్కారం, ఎంఈఓ పోస్టులు సీనియార్టీ ద్వారా భర్తీ వంటి డిమాండ్ల సాధనతో పాటు ప్రభుత్వ పంచాయతీరాజ్ యాజమాన్యాల ఉమ్మడి సీనియార్టీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని, ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ల ద్వారా ఎంఈఓ-1పోస్టులను భర్తీ చేస్తూ విద్యాశాఖ జారీ చేయడాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు కోరతున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

విజయపురం (నగరి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ బడులలో పని చేసే ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుండి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్లను పూర్తిగా రద్దు చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎన్.మణిగండన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో నాయకులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఫ్యాప్టో తరపున కలెక్టరేట్ ఎదుట 2వ తేదీ చేస్తున్న ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. పిఆర్.మునిరత్నం, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, నాగభూషణం, యువరాజ్, రూబన్, ప్రకాష్, సంతోష్ కుమార్, హరీష్, సురేష్బాబు, జనార్ధన్, హరిప్రసాద్, గణేష్, మోహన్, భాగ్యరాజ్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

నగరిలో ఫ్యాప్టో నాయకుల నిరసన

జిల్లాలో 94 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టిఆర్ భరోసా పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని డివిజన్లలోని భరత్ నగర్ మూడో గేటు వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించి నేరుగా పలువురు లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆగస్టు నెల పింఛన్లు అందించే క్రమంలో జిల్లాలో ఉన్న 2,69,025 మంది పింఛను దారులకు ప్రభుత్వం రూ. 94.12 కోట్లు విడుదల చేసిందన్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి 2,54,201 మందికి 88.85 కోట్ల పింఛను లబ్ధిదారులకు 94శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 1వ తేదీన పింఛన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి ఆగస్టు 2వ తేదీ శనివారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆగస్టు నెల నుంచి కొత్తగా 4,090 మందికి నూతనంగా పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటిని కూడా ఈ నెలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల సాధనే లక్ష్యం: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ హక్కులు, ప్రయోజనాల సాధనే లక్ష్యంగా ఏపీ కూటమి ఎంపీల బృందం పనిచేస్తుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలు హాజరైన చిత్తూరు ఎంపీ ఏపీ సర్వతో ముఖాభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం, శాఖల వారీగా, అందిస్తున్న తోడ్పాటు అభినందినీయమని ప్రకటనలో కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో చిత్తూరు పార్లమెంట్ను ప్రగతి పథం వైపు అడుగులేయించాలన్నదే తన సంకల్పమన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి: కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో ఎన్టీఆర్ హౌసింగ్ గృహనిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో ఎన్టీఆర్ హౌసింగ్ గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఏఈ లోకేష్, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. నగరపాలక పరిధిలోని ఎన్టీఆర్ కాలనీల్లో, లేఔట్లలో పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులు, గుత్తేదారులతో మాట్లాడి నిర్మాణ పనులు వేగంగా జరగేలా చూడాలన్నారు. అమినిటీ కార్యదర్శులు లేఅవుట్లను సందర్శించి పనులు వేగవంతం జరిగేలా సమన్వయం చేయాలన్నారు. వారంతపు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆటో మ్యుటేషన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆటో మ్యుటేషన్ విధానంపై శుక్రవారం చిత్తూరు గిరింపేటలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ పీవీఆర్ మూర్తి, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆటో మ్యుటేషన్ను పూర్తిచేయాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్శాఖ అధికారులను ఆదేశించారు. నూతన విధానంపై అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐలు, సబ్ రిజిస్ట్రార్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ హెల్త్ సెంటర్ ప్రశాంత్ నగర్ పరిధిలోని షావుకారుపేట ఏరియాలో శుక్రవారం చిత్తూరు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలతో కలిసి జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటి ఆవరణలో దోమల లార్వాలు సర్వే నిర్వహించడం జరిగింది. ప్రజలందరూ సమిష్టిగా ప్రతి శుక్రవారం కచ్చితంగా నిర్వహించాలని దోమల నివారణకు లార్వాను నాశనం చేయడమే మార్గమని అన్నారు. దోమల కాటువలన డెంగీ, మలేరియా వంటి విష జర్వాల భారిన పడే ప్రమాదముందని ప్రజలందరూ ఇళ్ల కిటికీలకు మెష్లు అమర్చుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, శివ సుబ్రమణ్యం, హెల్త్ అసిస్టెంట్లు సురేష్, మురళీకృష్ణ ,శ్యామల, జయశ్రీ, ఆషా కార్యకర్త ఉమాదేవి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న అధికారి

రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి

పలమనేరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి, పలమనేరు: చిత్తూరు, పలమనేరు, మదనపల్లి డివిజన్లలో రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్అండ్బి శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పలమనేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పలమనేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా ఆర్అండ్బి అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, డిసిసి బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిత్తూరు, మదనపల్లి, పలమనేరు డివిజన్ పరిధిలో ఎండిఆర్, ఎస్హెచ్, నాబార్డ్ కింద మంజూరైన రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన టెండర్ ప్రక్రియను పూర్తిచేసి, 6 నెలలలోపు రహదారి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పలమనేరు నియోజవర్గంలో మంజూరు అయిన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలమనేరు నియోజకవర్గం పరిధిలో అటు తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల మధ్య ఉన్న రహదారుల అభివృద్ధి కొరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకురాగా, ఇంటర్ స్టేట్ ఫండ్స్ నిధుల మంజూరు కొరకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. 100 శాతం పాట్ హోల్స్ ఫ్రీ కింద మంజూరైన పనులు పూర్తయినట్లు మంత్రికి అధికారులు తెలియజేశారు. రహదారుల నాణ్యత విషయంలో రాజీపడ వద్దని, అందుకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆర్ అండ్ బి శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేయాలని అన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతగా పనిచేస్తుంది

రాష్ట్రాన్ని ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిబద్ధతతో అమలు చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బైరెడ్డిపల్లి మండలం బైరెడ్డిపల్లి గ్రామంలో సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథ్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డితో కలిసి, పలమనేర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఆర్ అండ్ బి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల హామీలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకం సూపర్ సక్సెస్ అవుతున్నదని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందుతున్న తీరు ప్రతి నియోజకవర్గంలో ప్రజల వద్దకు వెళ్లి వారి సంతృప్తి స్థాయిని తెలుసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు పర్యటనలో భాగంగా పలమనేరులో పర్యటించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలను కలిసినప్పుడు కూటమి ప్రభుత్వం పరిపాలన, పనితీరు పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్రాన్ని డిజిటల్ హబ్గా తయారు చేయాలని, ఎపిలో పెట్టుబడులు ద్వారా ఎకో సిస్టం అభివృద్ధి చేయాలని చూస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీ ప్రకటించడం ద్వారా ప్రతి నెల రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయడం జరిగిందని, ఈ ఖర్చు ప్రభుత్వానికి భారమైనప్పటికీ ఆగస్టు 15 నుండి రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం కొరకు ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో పలు రోడ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు కనెక్టెడ్ ఉందని శుక్రవారం కేంద్ర ప్రభుత్వ శాఖల మంత్రి తిరుపతి పర్యటన సందర్భంగా వారి దృష్టికి సమస్యని తీసుకొని పోయి పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

అంతకు ముందు జరిగిన సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంచలంచెలుగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గతంలో అందిస్తున్న సామాజిక పెన్షన్లను రూ.3,000 నుండి పెంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద రూ.4,000 అందించడం జరిగిందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం సహాయంతో కలిపి రూ. 7,000 రైతులు ఖాతాకు ఆగస్టు 2న జమ చేయనున్నామని తెలిపారు. త్వరలో పలమనేరు - క్రిష్ణగిరి నాలుగు లైన్ల రోడ్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరు కానున్నదన్నారు.

బైరెడ్డిపల్లి మండలంలో సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా పింఛన్లు పంపణీ చేస్తూ

వి కోట బైపాస్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి

వీకోట : సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న వీకోట తూర్పు బైపాస్ రోడ్ అంశంపై పలమనేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి వీకోట మండల అఖిలపక్షం నేతలు వినతిపత్రం సమర్పించారు. గతంలో వికోటకు మంజూరైన బైపాస్ రోడ్డు అలైన్మెంట్ను మార్చి గత పాలకులు మండల అభివృద్ధిని విస్మరించి ఈ ప్రాంత అభివృద్ధికి అన్యాయం చేశారని, పార్టీలకతీతంగా ఏర్పడిన జేఏసీ నేతృతంలో ఈ అంశంపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంను ఆశ్రయించి స్టేటస్కో కొనసాగిస్తున్నామని మంత్రికి తెలియజేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టిలో కూడా ఉందని వారు గుర్తు చేశారు. వీకోటకు తూర్పు వైపున నాలుగు లైన్లు రోడ్డు వచ్చేలా ఎన్హెచ్ఏఐ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మండల టిడిపి అధ్యక్షుడు ఏ.ఎం.రంగనాథ్, రామచంద్ర నాయుడు, రామచంద్రుడు ఉన్నారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలి

డిఎంఅండ్ హెచ్ఓతో సమావేశమైన సిఐటియు, యూనియన్ నాయకులు

డిఎంఅండ్హెచ్ఒకి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, ఆశా యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఆశ వర్కర్ల సమస్యలపై ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియుతో శుక్రవారం డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో జాయింట్ సమావేశం జరిగింది. చర్చలు జరిపే సందర్భంగా ఫోన్లు లాక్కోవడాన్ని యూనియన్ నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రభుత్వ కార్యాలయంలో ఫోన్లు తీసుకోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు నాయకులు వాడ గంగరాజు మాట్లాడుతూ మూడునెలల క్రితం నిబంధనలకు విరుద్ధంగా ఆషాడ దగ్గర పని చేయిస్తున్న మెడికల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయంపై డిఎం అండ్హెచ్వో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆశాలపై పనిభారం పెంచుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ నిబంధనలకు విరుద్ధంగా అన్ని రకాల పనులు చేయించడం దారుణమన్నారు. రక్త పరీక్ష, గళ్ల పరీక్ష లాంటివి చేయకూడదని నిబంధనలు ఉన్న ఆశాలతో పరీక్షలు చేయించడం, పని గంటలకు ఎక్కువ చేయిస్తూ పనిభారం పెంచడం, అవమానకరంగా మాట్లాడుతూ మానసికంగా ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏదైనా సమస్యలకు వినతిపత్రాలు ఇస్తే తవణంపల్లి, గుడిపాల, తీర్థం తదితర పిఎస్సీలో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. సమస్యల విన్న డిఎంఅండ్ హెచ్ఓ స్పందిస్తూ నియోజకవర్గాల వారీగా సమావేశం నిర్వహించి ఆశాల సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ చర్చలలో యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, అనురాధ, మంజుల, మెహరు, సురేఖ పాల్గొన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ వీసీకి ఘననివాళి

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతికి ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి ఘన నివాళి అర్పించారు. శుక్రవారం మాజీ వీసీ మరణవార్త తెలుసుకున్న వీసీ దొరస్వామి విశ్వవిద్యాలయం ఆవరణలో లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మాజీ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ సంస్కృతిలోని జానపద మౌలికాంశాలను విశేషంగా గుర్తించడానికి అనువుగా దేశిసిరి ప్రాంగణాన్ని, శిల్పవని ఏర్పాటు చేశారని, ద్రావిడ సంస్కృతిపై జరుగుతున్న విశేషమైన పరిశోధనలన్నీ విస్తృతంగా ప్రపంచంలోకి తీసుకువెళ్లడానికి 'ప్రసారాంగ' కేంద్రానికి రూపకల్పన చేయడమే గాక విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి అనన్యమైనదని కొనియాడారు. నాలుగు డిపార్ట్మెంట్లుగా ఉన్న విశ్వవిద్యాలయాన్ని 15 డిపార్ట్మెంట్లుగా విస్తరించారని అలాగే తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రభుత్వాల నుంచి నిధులను విశ్వవిద్యాలయంకు తీసుకురావడానికి విశేషమైన కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. లక్ష్మీనారాయణ ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిర్వ్యాజమైన ప్రేమతో పని చేశారని వారి స్ఫూర్తి నిరంతరం మనతో నిలిచి ఉండాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ , ఉద్యోగులు ఆయనతో ఉన్న తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని నివాళులు అర్పించారు.

లక్ష్మీనారాయణకు ఘన నివాళులర్పిస్తున్న ద్రావిడ విశ్వవిద్యాలయ సిబ్బంది

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : జాతీయ నులిపురుగుల దినోత్సవంకు సంబంధించిన బ్యానర్, గోడ పత్రికలను శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. జిల్లాలో 1 నుంచి 18 సంవత్సరాల లోపల పిల్లలకు అందరికీ నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకుని రక్తహీనత లేని సమాజ స్థాపన కృషి చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, ఆర్బిఎస్కే నోడల్ అధికారి డాక్టర్ గిరి, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా వ్యాప్తంగా

రైతులకు రూ.138 కోట్లు లబ్ధి :కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా వ్యాప్తంగా ఈనెల 2వ తేదీన 2.05 లక్షల మంది రైతులకు రూ.138 కోట్లు లబ్ధి పొందనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అన్నదాత సుఖీభవ మొదటి విడత ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అర్హత కలిగిన ఒక్కొక్క రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమకానున్నాయని, 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 2,05 లక్షల మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సహాయం ప్రకటించిందని, ఇందులో కేంద్రం ఇచ్చే రూ.6 వేల సాయంతో కలిపి రాష్ట్ర వాటాగా మరో రూ.14 వేలు ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5వేలు, కేంద్రం వాటా రూ.2వేలు చొప్పున రూ.7 వేలు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తల్లి పాల వారోత్సవాలు మండల ఆరోగ్య అధికారి రాజేశ్వరి, ఇతర సిబ్బంది శుక్రవారం ప్రారంభించారు. తల్లులకు తల్లిపాల గురించి రాజేశ్వరి మాట్లాడుతూ తల్లి పాలు అమృతంతో సమానమని, తల్లి పాలు ఇవ్వటం తల్లికి, శిశువుకు మంచిదన్నారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాలించాలన్నారు. పుట్టినబిడ్డ నుండి ఆరునెలల వరకు తల్లి పాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ అమ్మాణ్ణి, సూపరువైజరు పంకజ, ఎంఎల్‌హెచ్‌పి గీతా, ఎఎన్ఎం సితారా, అంగన్‌వాడీ టీచర్ షాహిన, లతా, పారిజా తం, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

కార్వేటినగరం : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ పర్యవేక్షకులు వై. రోజారమణి అన్నారు. కార్వేటినగరంలోని ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్ నహీదా, హేల్పర్ రజిని, కమ్యూనిటీ హెల్త్ కవిత, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: తల్లిపాలు శ్రేయస్కరమని సిడిపిఓ వినత శ్రీ అన్నారు .శుక్రవారం మండలంలోని పాలేరు ,తగువారిపల్లి పంచాయతీలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరుజర్ పామీద బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్‌పి ఉన్నత పాఠశాల తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న డివైఈవో

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం సూరయ్య గారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మదనపల్లి డివైఈవో లోకేశ్వర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తేవాలని చదువు పైనే దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలన్నారు. చదువులో వెనుకబడి విద్యార్థులను బాగా చదివించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలు శిరీష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

త్రివేణికి సన్మానం

త్రివేణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండలానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయురా లు సి త్రివేణి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆమె గత సంవత్సరం వరకు కె గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో పని చేశారు. గత సంవత్సరం బదలీ పై యాదమరి ఉన్నత పాఠశాలకు వచ్చి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు. పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, రాష్ట్ర కౌన్సిలర్ జె భాస్కర్ రెడ్డి, ఎంఈవోలు రుక్మిణమ్మ, హెచ్ఎల్ఎన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు నరసింహరెడ్డి, అరుణ, ఓబుల్ రెడ్డి, మురళీ ఆమె ఇంటికి వెళ్లి సన్మానించారు. ఆమె పిఆర్‌టియు హైస్కూల్ విభాగం కన్వీనర్‌గా ఉపాధ్యా యులకు విశేష సేవలు అందించారని కొనియాడారు. అందరికి అందు బాటులో ఉండి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో త్రివేణి కృషి చేశారని కనకాచారి ప్రశంసించారు.

కమ్యూనిటీ సమావేశం

ప్రజాశక్తి -గంగవరం: కీలపట్ల గ్రామ పంచాయతీలోని యానాది కాలనీలో శుక్రవారం కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక సీఐ ప్రసాద్, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. యానాది కాలనీ ప్రజలకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఓటర్ కార్డ్స్, ఇంటి స్థలాలు, కరెంట్ పోల్, స్కూల్ బిల్డింగ్, ఇలాంటి సమస్యలు ఏవైనా వున్నాయా?' అని అడిగి తెలుసున్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రయాణికుల ఇబ్బంది

తరచూ మరమ్మతులకు గురై ఆగిపోతున్న బస్సు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్ర మైన సోమల మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతం లో మదనపల్లి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సర్వీస్ తిరుపతి నుండి మదనపల్లికి వెళుతూ మరమ్మతుకు గురై చెక్‌పోస్టు వద్ద ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఆర్‌టిసి సిబ్బందిని 'ఏం జరిగింది?' అని అడిగి తెలుసుకున్నారు. గేర్ బాక్స్‌లో ఒక పార్ట్ ఊడిపోవడంతో బస్సు ముందుకు కదలకుండా నిలిచి పోయిందని సిబ్బంది తెలిపారు. కాగా ఈ ఆర్‌టిసి బస్సు నిత్యం మరమ్మతులకు గురవుతూ అక్కడక్కడా నిలిచిపోతోందని డిపో వారికి చెప్పినా ఫలితం లేకుండా పోతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లి డిపో వారు స్పందించి మంచి కండిషన్ కలిగిన బస్సు సర్వీసును నడిపి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రయాణికులు కోరుతున్నారు.

జగన్‌కు తాపత్రయం ఎందుకో?: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్రంలో చచ్చిపోయిన వైసిపిని మళ్లీ బతికించుకోవడానికి జగన్‌మోహన్ రెడ్డి తాపత్రయ పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా నాయకుడికి ఉండవలసిన లక్షణం ఒకటి కూడా జగన్ మోహన్ రెడ్డి కి లేదని విమర్శించారు. వైసిపిని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

టిడిపి విజయం తథ్యం..!

- ఏపీఎస్‌ఆర్‌టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



ప్రజాశక్తి- రామకుప్పం: త్వరలో జరగనున్న రామకుప్పం మండలం, మణింద్రం పంచాయ తీ ఎంపీటీసీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి మంచి మెజార్టీతో గెలుస్తారని కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ అడ్వైసింగ్ కమిటీ మెంబర్, నియోజకవర్గ టిడిపి చేరికలు విభాగం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం వారు రామకుప్పం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ననియల తండాకు చెందిన నాగరాజు నాయక్‌తో పాటూ వైసిపి కార్యకర్త టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, ,నరసింహులు,రఫీ, గుర్రప్ప, సుబ్రీ, కృష్ణా నాయక్, కామరాజ్ నాయక్, పద్మమ్మ, అల్లి శీను, మనోహర్ ఉన్నారు.

ఏనుగుల గుంపు సంచారం

- పంటలు ధ్వంసం - రైతులకు నిద్ర కరువు
- పట్టించుకోని అటవీశాఖ సిబ్బంది



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని సవరం వారి పల్లి గట్టు వారి పల్లి గురి కాని వారి పల్లి తంగేడు మిట్ట తదితర ప్రాంతాలలో 16 ఏనుగుల గుంపు అటవీ ప్రాంతంలో నుండి రైతులు సాగుచేసిన పంట పొలాలపై దాడులు చేస్తూ ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

వారం రోజుల క్రితం ఆవులపల్లి పంచాయతీ దిగువ కొత్తూరు గ్రామానికి చెందిన రామకృష్ణ రాజు అనే రైతును పంట పొలం వద్ద ఉండగా దాడి చేసి తొక్కి చంపిన సంఘటన తర్వాత ఏనుగుల మంద అటు ఆవులపల్లి నంజంపేట 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలోని అటవీ ప్రాంతాలలో పగటిపూట మకాం వేసి సాయంత్రం చీకటి పడగానే రైతుల పంట పొలాలపై దాడులు చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నాగయ్య అనే రైతుకు చెందిన 70 టమోటా బాక్సులను కాయలతో నింపి పొలం వద్ద ఉంచి ఉండగా రాత్రి వేళల్లో ఏనుగుల మంద వచ్చి పూర్తిగా తినివేయడంతోపాటు బాక్సులను కూడా ధ్వంసం చేశాయని రైతులు తెలిపారు. ఎం రాజు, గురుస్వామి ఇంకా అనేకమంది రైతుల పంట పొలాలపై దాడులు చేస్తూ రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చుట్టపు చూపుగా రావడం సలహాలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదని నష్టపోయిన రైతులు వాపోతున్నారు. రైతులు టపాకాయలు తెచ్చి సాయంత్రం వేళల్లో వాటిని కాలుస్తూ ఏనుగులు పంట పొలాల పైకి రాకుండా ప్రయత్నం చేస్తున్నారు. కాగా శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయానికి వచ్చి తమ గోడు చెప్పుకుని జరిగిన పంట నష్టం వివరాలను అర్జీ రూపంలో ఇద్దామని దాదాపు ఈ ప్రాంతానికి చెందిన 20 మంది రైతులు రాగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో వెను తిరిగి వెళ్లినట్లు సమాచారం. పగలు ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల లోపు పంట పొలాల వద్ద రైతులు తమ పనుల ను చూసుకొని ఏనుగు ల భయంతో ఇళ్లకు చేరుకుంటున్నారు. అటవీ ప్రాం తాలలో ఉంటూ రాత్రి వేళల్లో పంట పొలాల పై దాడులు చేస్తూ అనుకోని పరిస్థితులలో గ్రామాల లోకి వస్తే ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నామని సాయంత్రం వేళలో గ్రామాలలో కూడా కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఏనుగుల సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యేంతవరకు దాదాపు ఏడు పంచాయతీల పరిధిలోని రైతులకు పంటలు పండించాలన్నా, వాటిని కాపాడుకోవాలన్నా ఎంతో క్లిష్ట పరిస్థితి ఏర్పడుతోంది. నాయకులు అధికారులు రైతుల దీనావస్థను అర్థం చేసుకొని ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: సోమల పంచాయతీ అడుసుపల్లిలో పంచాయతీ అధికారుల స్పందనతో కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించారు. మండల కేంద్ర మైన సోమల పంచాయతీ అడుసుపల్లిలో మురుగు నీటి కాలువలు చెత్తా చెదారంతో నిండి పోయి రోడ్డుపై మరుగునీరు పారుతుండడం, కొన్ని చోట్ల పిచ్చి మొక్కలు పెరిగి అసలు కాలువ ఉందా.. లేదా అన్న సందేహం కలిగేలా మారింది. గత నెల 31వ తేదీ 'ప్రజాశక్తి'లో అడుసుపల్లెలో పడకేసిన పారిశుధ్యం అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందన వచ్చింది. స్పందిం చిన పంచాయతీ కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులతో కలసి వెళ్లి మురుగునీటి కార్యా లయంలో చెత్తాచెదారం తొలగించి పిచ్చి మొక్కలు పెరికివేసి పారిశుధ్య పనులు చేపట్టారు. దీంతో గ్రామంలో మిగిలిన ప్రాంతాల్లోనూ మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం తొలగించి నీరు పారేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌పిని కలిసిన స్థానిక నాయకులు

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి మణికంఠ చందోలు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్యకి, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పిని వెదురుకుప్పం టిడిపి మాజీ మండల అధ్యక్షులు మోహన్ మురళీ కార్యకర్తలతో కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని పంచాయతీ సెక్రటరీలకు, అధికారులకు సమాచార హక్కు 2005 చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని గంగాధర నెల్లూరు అబ్బాస్ కాలనీ వద్ద శుక్రవారం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. అంజుమనే ఈ హైదర్రీ కమిటీ ఆధ్వర్యంలో జీడీ నెల్లూరు అబ్బాస్ కాలనీ వద్ద ముస్లిం మత పెద్దల కుటుంబీకులు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, పిల్లలు, యువకులు , పెద్దలు ఊరేగింపు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ హైదరీ కమిటీ అధ్యక్షుడు మౌలాసాహెబ్, కమిటీ ఉపాధ్యక్షుడు ముక్తార్ హుస్సేన్, మతగురువు విరాసత్ అలీ, పలువురు షియా ముస్లింలు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: మద్యం కేసులో అరెస్ట్ అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి బెయిల్ రావాలని శుక్రవారం మోటు మల్లెల శివాలయంలో రొంపిచర్ల ఎంపిపి చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్‌పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరీముల్లా, విజయ శేఖర్, శ్రీనాథ నాయుడు, పెద్దిరెడ్డి దేవేందర్ రెడ్డి, ముని కృష్ణారెడ్డి, గురు, కాలేశా, మహబూబ్ బాషా, బావాజీ, రవీంద్ర, నీరజాక్షుల నాయుడు, వెంకటరత్నం పాల్గొన్నారు.

రొంపిచర్ల: మిథున్ రెడ్డికి బెయిల్ రావాలని పులిచెర్ల మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయంలో వైసిపి నాయకుడు మురళి రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల మండలంలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి ప్రభుత్వ కొలువు

ఒకే కుటుంబంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అక్కాతమ్ముడు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పెనుమూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చంగల్ రాయలు, జగద దంపతుల ఇద్దరు పిల్లలు అక్కా, తమ్ముడు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఒకే సారి ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని పెనుమూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చంగల్ రాయులు జగద దంపతులకు రేవతి, తిరుమలయ్య ఇద్దరు సంతానం. శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాలలో ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ప్రభుత్వ ఉద్యో గానికి ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ఇద్దరు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే

ప్రమాణ స్వీకారం చేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి పథంలో నడపాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన పంట మార్కెట్లో విక్రయిం చుకునేందుకు మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేశారని తద్వారా రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కార్యవర్గాన్ని నియమించి సిబ్బంది నియమించారన్నారు. అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా భాస్కర్ నాయుడు, ఉపాధ్యక్షులుగా సుధాకర్, మెంబర్లుగా చిరంజీవి, సుజాత, చిట్టెమ్మ, జగదీష్, హరిప్రసాద్, నీలమ్మ, రవి కుమారి, జ్యోతి, రామానుజన్, గురుస్వామి, గిరిజ, భాస్కర్ నాయుడు, గౌరీ, సింగిల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, స్థానిక సర్పంచ్ అమరావతి, పశు శాఖ సంవర్ధక శాఖ ఏడీ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట అంబేద్కర్ విగ్రహం నుండి వ్యవసాయ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, జెడ్పిటిసి సుచిత్ర, టిడిపి మండల గౌరవ అధ్యక్షులు జయప్రకాష్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచులు అమరావతి, కోదాడ యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్, పూతలపట్టు నియోజకవర్గ టిడిపి నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మా బిడ్డ మృతదేహాన్ని అప్పగించండి

రోడ్డుపై బైఠాయించి తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి-పలమనేరు రూరల్(గంగవరం), బైరెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తమ బిడ్డ మృతదేహాన్ని వెంటనే అప్పగించాలని కోరుతూ మృతుడి తల్లిదండ్రులు కొలమాసనపల్లి పంచాయతీ బేలుపల్లి క్రాస్ రోడ్డువద్ద శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ కొలమాసనపల్లి పంచాయతీ బేలుపల్లి గ్రామానికి చెందిన భాస్కర్(25)గురువారం నెల్లూరులో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని, ఇంతవరకు పోలీసులు మృతదేహాన్ని అప్పగించలేదని, కనీసం మృతదేహాన్ని చూడడానికి కూడా ఆస్పత్రి వారు అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బేలుపల్లి క్రాస్ వద్ద గ్రామస్తులతో కలిసి మృతుడి తల్లి దండ్రులు కుప్పం పలమనేరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. తమ బిడ్డను అప్పగిస్తే దహన క్రియ లు నిర్వహించు కుంటామని వెంటనే తమ బిడ్డ మృతదేహాన్ని తమకు అప్పగించాలని, ఇందుకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించి జోక్యం చేసుకోవాలని కోరారు.

దాతల సాయం

ఉచిత మంచినీటి సౌకర్యం ఏర్పాటు



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ 48 బసివి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన గంగినేని కృష్ణయ్య ఉన్నత చదువులు చదివి హైదరా బాదులో స్థిరపడ్డాడు. అక్కడే నివాసం ఏర్పరచుకున్నారు. సొంత గ్రామానికి మంచి చేయాలని ఉద్దేశంతో గ్రామస్తుల కోరిక మేరకు ఆ గ్రామంలో ఆక్వా ఉచిత మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పలువురు ఆయన ఆదర్శాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య, మాజీ సర్పంచ్ విజయబాబు, శ్రీ సత్య సాయి సేవ ఆర్గనైజేషన్ చిత్తూరు జిల్లా వారు, గ్రామస్తులతో కలిసి ఉచిత ఆక్వా మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి బాబు, మేఘనాథం, బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ విద్యాధరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షికారి కాలనీలో మౌలిక వసతులపై అధికారులతో సమీక్షించారు. గత శుక్రవారం జాయింట్ కలెక్టర్ యదమరి మండలం కినాటం పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని షికారి కాలనీ గ్రామాన్ని సందర్శించారు . గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తెలిపారు. గ్రామంలోని సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి శుక్రవారం యాదమరి తాసిల్దార్ పార్థసారథి, మండల అభివృద్ధి అధికారి వేణు , పలు శాఖల అధికారులతో షికారి కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, ఇంటి పట్టాలు, శ్మశాన వాటిక ఏర్పాటు, రేషన్ కార్డుల విభజన, షికారి కాలనీలో మౌలిక వసతుల కల్పన సంబంధించిన పలు అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. వెంటనే పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో తహశీల్దారు పార్థసారథి, ఎంపీడీవో వేణు , మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): 2029 నాటికల్లా రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డ్వామా పీడీ రవికుమార్ పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిఆర్డిఏ మీటింగ్ హాల్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా కూడా సంతకాలకు బదులుగా వేలిముద్రలు వేసే ప్రజలు ఉన్నారని, క్యాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 2,61,185 మంది నిరక్షరాస్యులను గుర్తించామని మొదటి విడతగా చిత్తూరు జిల్లాలో ఈ సంవత్సరం 76,410 మంది వయోజనులైన నిరక్షరాస్యులను తీసుకొని వారందరినీ డిఆర్‌డిఏ , మెప్మా, డ్వామా సహకారంతో అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించామన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో మొత్తం 2,61,185 మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి చిత్తూరు జిల్లాను అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ ఆజాద్, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మొయినుద్దీన్, డిఆర్డిఏ డిపిఎం మంజుల తదితరులు హాజరయ్యారు.

నూతన పింఛన్లు పంపిణీ


గుడుపల్లిలో

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదల పాలిట వరమని జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి పంచాయతీలో నూతన వితంతు పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో వితంతువు పెన్షన్ లబ్ధిదారులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, టిడిపి సీనియర్ నాయకులు దేవరాజు నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్,బుజ్జి బాబు రెడ్డి, జయరామి రెడ్డి, తుకారాం రెడ్డి, దామోదర్ రెడ్డి, అఖిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లి: గుడిపల్లి మండలం చీకటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త పెన్షన్లను పంచాయతీ టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ రామయ్య ఆధ్వర్యంలో కొత్త పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అంచలంచెలుగా పెన్షన్లను పెంచుతామని ప్రలోభాలు పలికిన నాయకులు ఎక్కడ ఉన్నారు? అని ఆయన ప్రశ్నించారు. సిఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మాట ప్రకారం పెన్షన్లు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్, భూపతి, శ్రీనివాసులు అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్టలో ఎస్ఆర్ పురం మండల టిడిపి అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో సూరి రెడ్డి గురునాథం సతీష్ యువరాజు దాము చందు కుమార్ జీవన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేపల్లి: చౌడేపల్లి మండలంలో 95 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె పంచాయతీ కొత్తపేట గ్రామంలో శుక్రవారం కొత్త గా వితంతు పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో ఆనందం వ్యక్తం చేశారు. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ మునికృష్ణ నాయుడు పాల్గొన్నారు.

కార్వేటినగరం : మండల పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను ఎంపీడీవో టీ చంద్రమౌళి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు దాదాపు 90 శాతం సచివాలయ సిబ్బంది పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు చిత్రపటం అందిస్తున్న ఈవో

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ది వినాయకుడిని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. పుట్టిన రోజు సందర్భంగా ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి వినాయకుడి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించారు. స్వామి చిత్రపటాన్ని, తీర్ధ ప్రసాదాలను ఈవో అందించారు. అనంతరం ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, కాణిపాకం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాణిపాకంలో క్రెయిన్‌తో భారీ గజమాలతో ఎమ్మెల్యే ను సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్ కట్ చేసి నాయ కులకు, కార్యకర్తలకు, అభిమానులకు తినిపించారు. ఈ కార్యక్రమం లో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారు పాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణీ నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో ఆర్డినేటర్ గిరిధర్ బాబు, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ జెడ్పీటీసీ లతా బాబునాయుడు పాల్గొన్నారు.

జాప్యం చేయొద్దు..

గోకులాలకు బిల్లుల చెల్లింపుపై కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): గోకులాల బిల్లులు చెల్లింపులలో జాప్యం చేయొద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో నరేగా పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,795 మినీ గోకులాల షెడ్లు నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో రూ.62.93 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పనుల్లో పురోగతి చూపేలా షెడ్ల పనులు పూర్తికాగానే 10 రోజులలో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. పూతలపట్టు, చౌడేపల్లిలో ఎస్ఈ ఇరిగేషన్ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పీడీ డ్వామా, డిఈ లు, ఏఈలు, ఇరిగేషన్ అధికారులు, ఏపీడీలు, ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐదు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని మణింద్రం ఎంపీటీసీ సెగ్మెంట్‌కు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. గురువారం టిడిపి అభ్యర్థులు అరుణ, విశాలాక్షి రెండు సెట్లు, వైసిపి అభ్యర్థి అర్పిత ఒక నామినేషన్లు వేశారు. శుక్రవారం టిడిపి అభ్యర్థి అరుణ మరో రెండు సెట్ల నామినేషన్లు దాజీలు చేశారు. కాగా శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన, ఐదవ తేదీన అభ్యర్థుల ఉపసంహరణ అనంతరం తుది జాబితాలోని అభ్యర్థుల ప్రకటన, 12వ తేదీన ఎన్నికలు, 14 తేదీన ఫలితాలు ఉంటుందన్నారు.

స్వల్ప ఉద్రిక్తత

కాంగ్రెస్ తరపున డిసిసి ప్రెసిడెంటు భాస్కర్‌తో పాటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయనున్న అభ్యర్థి గీత, స్వతంత్ర అభ్యర్థి శ్రీదేవి నామినేషన్లు వేసేందుకు కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో టిడిపి నాయకులు, వారికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో వారు వెనుదిరిగారు.

1125 మంది రైతులకు మొండి చేయి

మండలంలో పీఎం కిసాన్‌కు అనర్హత

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 1125 మంది రైతులకు పిఎం కిసాన్ పథకం వర్తింపులో మొండి చేయి ఎదురైంది. మండలంలో అన్నదాత సుఖీభవకు 9,080 మంది రైతులు ఎంపిక చేశారు. నిబంధనల దృష్ట్యా పీఎం కిసాన్‌కు 7,955 మంది రైతులను ఎంపిక చేశారు. దీంతో 1125 మంది రైతులు పీఎం కిసాన్ పొందేందుకు అర్హత కోల్పోయారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం అన్నారు. ప్లాట్ విలువ ఆధారంగా రుసుం చెల్లించాలన్నారు. 10 శాతం మేర ఓపెన్ స్పేస్ లేకపోతే 14శాతం అదనంగా వసూలు చేయవలసి ఉంటుందన్నారు. జూన్ 30, 2005 నుండి నుంచి 90 రోజులలోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9080 మంది రైతులకు అన్నదాత సుఖీభవ: ఎంఏవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు శనివారం రైతు ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు వ్యవసాయ అధికారిణి భారతి శుక్రవారం తెలిపారు. మండలంలో 9080 మంది రైతులకు అన్నదాత సుఖీభవ నాలుగు కోట్ల 54 లక్ష రూపాయలు , పీఎం కిసాన్ నుండి 7955 మంది రైతులకు ఒక కోటి 59 లక్షల పదివేల రూపాయలు నగదులను జమ చేయనున్నట్లు అన్నదాత, సుఖీభవ ద్వారా ఆరు కోట్ల 13 లక్షల పదివేల రూపాయల నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
O.S.No. 15 of 2017

Between :
Smt Kothapalli Vasanthamma ....Plaintiff
And:
Ramakrishna Reddy gari Srinath Reddy (died) & 7 others
..Defendants No. D5, D7 and D8

To
The Respondents
5, 7 and 8/Defendant No. 5, 7 and 8

1.Ramachandra, husband of Late Smt R.Pooniamma
2. Vams, S/o Late Ramakrishna Reddy gari srinatha Reddy
3. Smt Yamuna, D/o Late Ramakrishna Reddy Srinatha Reddy
Residents of D.No.22-965/6, Kameswara Nagar,Muruganapalli Village, Chittoor Town & District A.P

Take notice that the above suit in **O.S.No. 15/2017** for your appearance is stands posted **to 02-09-2025 at 10-30 a.m.** for your notice and appearance before the above Court. Therefore at your liberty to appear either in person or through Advocate to appear before the above Court on **02-09-2025 at 10-30 A.M.** and to raise objections if any, failing which the matter will be decided according to law

Sd/- **G.VASANTHA KUMAR**
Advocate for Plaintiff
Place:Chittoor, Date:31-07-2025

కోర్టు నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 143/2020

రావి లక్ష్మీనారాయణ ......వాది
వర్సెస్
పూలా ప్రభాకర్ ....ప్రతివాది

To
ప్రతివాది,
పూలా ప్రభాకర్, తండ్రి పి.వెంకటేశ్వర్లు నాయుడు, డోర్ నెం. 25-325, వెల్లూరు రోడ్, గ్రీమ్స్ పేట్, చిత్తూరు, చిత్తూరు జిల్లా.

పై నెంబరు కేసులో మీరు ప్రతివాది అయియున్నారు.మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి డైలీ న్యూస్ పేపరు చిత్తూరు జిల్లా ఎడిషన్‌లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరుఈ ప్రకటనను చూసిన పిదప తేది:22-08-2025 ఉదయం 10:30 గం.లకు మీరు గానీ, మీ తరపున లాయరు గానీ కోర్టువారి ఎదుట హాజరై మీకు పై తెలిపిన దావాలో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపు కోనవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి పైతెలిపిన దావాను కోర్టువారు మీపరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఒంగోలు,
30-07-2025
ఇట్లు
పంగులూరి గోవిందయ్య,
వాది తరపున న్యాయవాది,
ఒంగోలు,ప్రకాశం జిల్లా